క్లుప్తంగా

నేడు వైద్య శిబిరం

గరుగుబిల్లి: భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని తోటపల్లి పంచాయతీ నందివానివలస గ్రామంలోని జట్టు ఆశ్రమం సమీపంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. డా.పి విసి.శేషగిరిరావు జ్ఞాపకార్థం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. శిబిరంలో డా.రామ్మోహనరావు, డా.జి.ప్రభాకరరావు, డా.వై.వివేక్, డా.నిరుపమ వైద్యసేవలను అందించనున్నట్టు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి


మొక్కలు నాటుతున్న ఎంపీపీ ఆదినారాయణ తదితరులు

సీతంపేట: ప్రతీ ఒక్కరూ ఒక మొక్క నాటాలని ఎంపీపీ బి.ఆదినారాయణ అన్నారు. జన జాతీయ గౌరవ్ దివాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక గిరిజన సంక్షేమ బాలుర కళాశాల ఆవరణలో వన సంరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. సమాజ్ పరివర్తన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ విద్యార్థులకు టెన్త్ విద్యార్థులకు సోషల్ స్టడీస్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.కళావతి, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, ప్రధానోపాధ్యాయుడు టి.చంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థికి గాయాలు


పీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్న రేష్మ

భామిని: మండల కేంద్రంలో సోమవారం ఆర్టీసీ బస్సు ఎక్కబోయిన ఎస్.రేష్మ విద్యార్థి అదుపుతప్పి కింద పడి గాయపడింది. రేష్మను పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. భామిని నుంచి బత్తిలి వెళ్లేందుకు బస్సు వెనుక పరుగులు పెడుతున్న రేష్మ కింద పడిపోయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

విద్యార్థులకు పలు పోటీలు


చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సీతంపేట: జన జాతీయ గౌరవ దివాస్‌లో భాగంగా ఐటీడీఏ స్థాయిలో గిరిజన విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు సోమవారం నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ఎ.సుస్మిత, డి.నవ్యశ్రీ, ఎస్.మీనాక్షి విజేతలుగా నిలిచారు. చిత్రలేఖనంలో ఎస్.దేవి, బి.లావణ్య, వై.మౌనిక, వక్తృత్వ పోటీల్లో ఎస్.సుహాసిని, బి.ప్రకాష్, పి.శృతి విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, సీఎంఓ చిరంజీవి, స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్‌దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అంగన్‌వాడీ చిన్నారులు


అంగన్‌వాడీ చిన్నారుల గేయాలకు ముగ్ధురాలైన ఎమ్మెల్యే కళావతి

భామిని: మండలంలోని బొమ్మిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు పాటలు, గేయాలతో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిని సోమవారం ఆకట్టుకున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతో పాటు ప్రీ ప్రైమరీ బోధన చేయిస్తుండడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని ఎమ్మెల్యే గుర్తించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఎమ్మెల్యే మిఠాయిలు, జామకాయలు అందజేసి మురిసారు. పిల్లలు ఎమ్మెల్యేకు పూలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట సీడీపీఓ భవాని, ఎస్‌ఓ జ్యోతిలక్ష్మి ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


నిరసనలో పాల్గొన్న అంగన్‌వాడీలు

పాలకొండ: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ నాయకులు ఎన్.హిమప్రభ కోరారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సమస్యల పరిష్కారానికి సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కోరుతూ డిసెంబర్ 8 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని తెలిపారు. సమ్మెలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దావాల రమణారావు, బి.అమరవేణి, జి.జెస్సీబాయ్ తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ

కార్తీక మాసం తొలి సోమవారం శివాలయాల వద్ద భక్తులు బారులు తీరారు. హరహర మహాదేవ.. శంభో శంకర అంటూ నినదించారు. భక్తుల నినాదాలతో అన్ని చోట్ల ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్


భామిని: నేరడి-బి నీలకంఠేశ్వరుడు ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


గరుగుబిల్లి: శివునికి పూజలు చేస్తున్న అర్చకులు


జియ్యమ్మవలస: రావాడ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


సీతంపేట: కాశీవిశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో భక్తులు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన


ప్రభుత్వ పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

భామిని: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని వడ్డంగిగూడ, బొమ్మిక గ్రామాల్లో బత్తిలి సొసైటీ చైర్మన్ బోదెపు రఘుపతినాయుడు, సర్పంచ్ కొండగొర్రి ఉషారాణి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఇంకా సమస్యలేమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల కోసమే నిరంతరం తపిస్తున్న జగనన్నకు అంతా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ముందుగా గిరిజన మహిళలు ఎమ్మెల్యే కళావతికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా వడ్డంగిగూడలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. నిర్మాణ వ్యయంపై ఐటీడీఏ ఏఈఈ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి వచ్చే పిల్లలు నడిచేందుకు అనువుగా సీసీ రోడ్డు, వీధి కాలువ నిర్మాణం చేపట్టాలని గిరిజనులు కోరగా జీజీఎంపీ నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే కళావతి హామీ ఇచ్చారు. జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలకు రక్షణ లేక వీధులన్నీ బురదమయంగా మారుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, సొసైటీ చైర్మన్ జి.రమేష్, ఈఓపీఆర్‌డీ కృష్ణారావు, ఏపీఎం భవాని, ఏపీఓ తులసీదాస్, సీడీపీఓ భవాని, వలంటీర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వ హయాంలో భూ యాజమాన్యపు హక్కులు


డీకేటీ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హాయంలో భూమి సాగు చేసుకునే రైతులకు పూర్తి స్థాయిలో భూ యాజమాన్యపు హక్కులు కలగజేయడం జరుగుతుందని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో డీకేటీ పట్టాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో లక్షా 53 వేల ఎకరాల్లో గిరిజనులకు కొండపోడు పట్టాలు ఇచ్చారన్నారు. రైతు భరోసా కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. మన ఐటీడీఏ తరఫున దాదాపు 35 వేల ఎకరాల్లో భూ పంపిణీ జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఈ భూముల్లో బోర్లు వేసే కార్యక్రమానికి కూడా ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఎటువంటి సాగు లేకుండా ఉన్న ప్రభుత్వ భూమికి దరఖాస్తు చేసుకుంటే సర్వే చేసి గిరిజనులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎంపీటీసీ ఎస్.చంద్రశేఖర్, తహసీల్దార్ నరసింహమూర్తి, వైకేపీ ఏపీఎం విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాతో ఆదుకుంటాం..

భామిని: భూమి లేని పేదలందరికీ భూమి కల్పించాలనే ధ్యేయంతోనే ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న గిరిజనులకు డీకేటీ పట్టాలు ఇచ్చి రైతు భరోసా నిధులు కేటాయించి ఆదుకొంటున్నామని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని మనుమకొండలో తహసీల్దార్ నీలాపు అప్పారావు ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న గిరిజన రైతులకు డీకేటీ పట్టాలను సోమవారం అందజేశారు. ఎంపీటీసీ పత్తిక మురళి, సర్పంచ్ నిమ్మల కేశవ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శివస్వాములకు అన్న సమారాధన


శివస్వాములకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అన్న సమారాధన చేశారు. కౌన్సిలర్లు తుమ్మగుంట అనూష శంకరావు ఆర్థిక సహాయంతో శివ స్వాములకు సామూహిక అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రారంభించారు. వందల సంఖ్యలో శివస్వాములు పాల్గొన్నారు. సన్నిధానంలో ప్రతి రోజు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తమ సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ తెలిపారు.

ఎంపీడీఓ మృతికి సంతాపం


కురుపాం తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీఓ మృతికి సంతాపం తెలుపుతున్న సిబ్బంది

కురుపాం: ఎంపీడీఓ వీవీ శివరామప్ప మృతికి తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, సిబ్బంది తమ కార్యాలయంలో సోమవారం సంతాపం తెలిపారు. ఎంపీడీఓ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. మండలంలో పలు సచివాలయాల్లో కూడా ఈయన మృతికి సిబ్బంది సంతాపం తెలిపారు.

ఎంపీడీఓ మృతి తీరని లోటు

ఎంపీడీఓ శివరామప్ప మృతి మండల అభివృద్ధికి తీరని లోటు అని ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత పేర్కొన్నారు. ఎంపీడీఓ స్వగ్రామమైన కాకినాడ జిల్లా పిఠాపురం గ్రామానికి వెళ్లిన ఎంపీపీ, జెడ్పీటీసీ ఆయన మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని భరోసానిచ్చారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయ్, ఉపాధి ఏపీఓ బావాజీ ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం


బాలల హక్కుల గూర్చి వివరిస్తున్న హెచ్‌ఎం

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు పలు అంశాలపై వివరించారు. జీవించే హక్కు, ఉచిత నిర్బంధ విద్యా హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్య హక్కుల వంటి వాటిపై హెచ్‌ఎం ఎ.లిల్లీరాణితో పాటు ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల వితరణ


విద్యా సామగ్రిని విద్యార్థులకు అందజేస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన మద్ది శ్రీనివాసరావు తన పుట్టిన రోజు సందర్భంగా సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు బ్యాగులు, తదితర విద్యా సామాగ్రితో పాటు ఒక్కో విద్యార్థికి రూ.500 చొప్పున్న వితరణ చేశారు. వితరణగా శ్రీనివాసరావు అందజేసిన సామగ్రిని సర్పంచ్ బి.గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు రూ.11వేలు విలువ చేసే వస్తువులను చదువులో ప్రతిభ కనబరుస్తున్న నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు వితరణ చేయడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

యాత్రను సందర్శించిన మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అధికారి


ఇరిడిలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

గుమ్మలక్ష్మీపురం:

మండలంలోని ఇరిడి గ్రామంలో సోమవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను భారత ప్రభుత్వ మోడల్ ఆఫీసర్ (మినిస్ట్రీ ఆఫ్ హెల్త్) డాక్టర్ అమిత్ గయాన్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన కళాజాత ప్రదర్శన, ఎల్ఈడీ ప్రదర్శనలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలంతా అవగాహన పొందాలని, వాటిలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యమై దేశాభివృద్ధికి తోడ్పాటునందివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, ఇరిడి ఎంపీటీసీ కె.మల్లేశ్వరరావు, తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.బుద్దేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన

- శాసన మండలి విప్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్


పాలకొండ : గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: గ్రంథాలయాలతో విజ్ఞానాన్ని సముపార్జించవచ్చని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను పాఠకులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం పలు పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, ఎంపీపీ బొమ్మాళి భాను, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మధరావు, కౌన్సిలర్లు తుమ్మగుంట శంకరరావు, బాసూరు కాంతారావు, గ్రంథాలయాధికారి బి.గణేష్‌బాబు, పలువురు ఉపాధ్యాయులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి


గరుగుబిల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: ప్రతీ ఒక్కరూ గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా పలుపోటీలలో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ఎంఈఓ 2 కొండలరావు, గ్రంథాలయ నిర్వాహకుడు ఎన్.మధుసూధనరావు, ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, గురుకుల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటరత్నం విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


గుమ్మలక్ష్మీపురం: శాఖా గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్

గుమ్మలక్ష్మీపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ముగిసాయి. ఈ సందర్భంగా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్పంచ్ బి.గౌరీశంకరరావు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రేవతి, రిటైర్డ్ హెచ్‌ఎం జి.హరిప్రసాద్ తదితరులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ సుకన్య మాట్లాడుతూ గ్రంథాలయాన్ని గ్రామస్తులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి


భామిని: విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ అప్పారావు

భామిని: నిత్యం పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు అన్నారు. శాఖా గ్రంథాలయంలో సోమవారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్, ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్లు ఎ.సునీత, సునంద, కార్యదర్శి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

• జగనన్నతోనే ఉజ్వల భవిష్యత్తు

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. అన్నిచోట్ల ప్రజాదరణ పొందుతోంది. సోమవారం జరిగిన కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు విస్తృతంగా పాల్గొని రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు కావాలో వివరించారు. జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజలంతా దీన్ని గుర్తించి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


గరుగుబిల్లి: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో సంక్షేమ చార్ట్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు తదితరులు


కొమరాడ: ఆర్తాంలో జెండా ఎగిరివేస్తున్న జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి తదితరులు


పాలకొండ రూరల్: లుంబూరులో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంపీపీ బొమ్మాళి భాను, తదితరులు


గుమ్మలక్ష్మీపురం: పెదఖర్జలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కె.దీనమయ్య, వైఎస్సార్‌సీపీ శ్రేణులు


సీతంపేట: గొయిదిలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ఆదినారాయణ, పార్టీ నాయకులు

రావుపల్లిలో నగర సంకీర్తన

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామంలో కార్తీక మాసం సందర్భంగా శివస్వాములు నగర సంకీర్తన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ మేరకు ఉమా రామలింగేశ్వర భజన బృందం గురుస్వామి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రతీ రోజు వేకువజామున గ్రామంలోని ఆయా వీధుల్లో శివుడ్ని కీర్తిస్తూ భజనలు చేస్తుంటారు. కార్తీకమాసం పూర్తయ్యేంత వరకు నగర సంకీర్తన నిర్వహించనున్నట్టు బృందం సభ్యులు తెలిపారు. స్థానిక సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావుతో పాటు పలువురు భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.